క్లుప్తంగా

పల్లెల్లో కొత్త అమావాస్య సందడి

రాంబిల్లి : పల్లెల్లో కొత్తఅమావాస్య సందడి నెల కొంది. ఈ నెల 21న గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి పండగను నిర్వహించనున్నారు. పండగ ముందు ప్రతిరోజూ అమ్మవారి ఘటాలను ఊరేగింపు చేస్తారు. దిమిలి, రాజుకోడూరు, వెల్చూరు, కట్టుబోలు తదితర గ్రామాల్లో ఘటాల ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తున్నారు. కొత్త అమవాస్య రోజు అమ్మవారి జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపు నక్కపల్లి వారపు సంత ఆశీలు వేలం

నక్కపల్లి: మండల కేంద్రంలో గల వారపు సంతలో ఆశీళ్లు వసూలు చేసుకునే హక్కుకు సంబంధించి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు కాల పరిమితికి నిర్వహించే వేలంలో సంతలో ప్రతిశుక్రవారం, బుధవారం ఆశీళ్లు వసూలు చేసుకోవచ్చన్నారు. పాటలో పాల్గొనదలచిన వారు లక్ష రూపాయల విలువైన డీడీ, రూ.3 లక్షలు విలువైన సాల్వెన్సీ సర్టిఫికేట్ సమర్పించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవాలు


సాంబశివున్ని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మునగపాకలో సాంబశివుని ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సాంబశివున్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. భక్తులకు సదుపాయాలు కల్పించడానికి ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు తగు చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిగింది. అలాగే స్థానిక పల్లపు వీధిలోని వినాయక ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వినాయకుడిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలి..


కోటవురట్లలో హౌసింగ్ డే కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ కోరారు. స్థానిక వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌లో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఇంటి నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే మొదలెట్టాలని సూచించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కరుణ, పీఆర్ జేఈ వర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులకు ఉపాధి పనులు


ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న ఏపీవో

కె.కోటపాడు: మండలంలోని 32 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు జాబ్‌కార్డుదారులు హాజరు కావాలని ఏపీవో వసంత్ కోరారు. ఎ.భీమవరంలో గుండాల చెరువు, సూదివలస గ్రామాల్లో ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారుల రోజు వారి గరిష్ట వేతనం రూ.257 పొందేలా పనులు చేయాలన్నారు. స్వగ్రామాల్లోనే ఉపాధి పనులకు వేతనదారులు హాజరు కావడం వల్ల పనితోపాటు గ్రామాభివృద్ధి చెందుతుందన్నారు. ఎ.భీమవరంలో గుండాల చెరువులో పూడిక తీత, చెరువుగట్టు పటిష్టత పనులు రూ.3.50 లక్షల ఉపాధి నిధులతో చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నో బ్యాగ్ డే...ఆటపాటల జాలీ డే


రైయిన్ బో ప్యారాచూట్ గేమ్ ఆడుతున్న విద్యార్థులు


రింగ్‌తో బ్యాలెన్స్ చేస్తున్న బాలికలు


స్మార్ట్ టీవీతో కార్టూన్స్ చూస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం : వమ్మవరం మోడల్ ప్రైమరీ పాఠశాలలో నోబ్యాగ్ డే వచ్చిందంటే విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు చేరినప్పటినుంచి విద్యార్థుల దృష్టి క్రీడల వైపు మలచడంతో సందడి చేస్తూ కేరింతలు కొడుతున్నారు. ఈ క్రమంలో శనివారం విద్యార్థులతో రైయిన్‌బో ప్యారాచూట్, రింగ్ బ్యాలెన్స్, కార్డులతో పజిల్స్ క్రీడలు ఆడించారు. అంతే కాకుండా స్మార్ట్ టీవీతో జ్ఞానాన్ని పెంచే ప్రోగ్రామ్స్ చూపించారు. ఈ క్రీడలు ఆడించేందుకు ఆట వస్తువులన్నీ ప్రభుత్వం నుంచి సమకూరినవేనని ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు తెలిపారు. ఇటువంటి వాతావరణం కార్పొరేట్, సెంట్రల్ సిలబస్ పాఠశాలలో అందించేవారని, ఇప్పుడు ప్రభుత్వ గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలో అందిస్తుందని చెప్పారు. నో బ్యాగ్ డే క్రీడలతో పాఠశాల వాతావరణం సందడిగా మారింది.


కార్డ్స్‌తో అక్షరాలను గుర్తిస్తున్న విద్యార్థులు

ముందు జాగ్రత్తలతో గ్లకోమా నివారణ

నక్కపల్లి : ముందు జాగ్రత్తలతో గ్లకోమాను నివారించవచ్చని గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్, నక్కపల్లి అప్తాల్మిక్ అధికారి మజ్జి గణపతి రావు సూచించారు. గ్లకోమా వారోత్సవాల సందర్భంగా శనివారం నక్కపల్లి సచివాలయంలో అవగాహన శిబిరం నిర్వహించారు. 40 ఏళ్లు నిండిన వారందరూ కంటి పరీక్షలతో గ్లకోమా పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కంటి నరాల్లో ఒత్తిడి వల్ల గ్లకోమా వచ్చే అవకాశం ఉందన్నారు. నరాల్లో ఏర్పడిన ఒత్తిడి వల్ల రెటీనా దెబ్బతిని కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కంటి నరాలపై ఒత్తిడి తగ్గించుకోవాలన్నారు. ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా గ్లకోమాకు కూడా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తోందన్నారు. గ్లకోమా నిర్ధారణ కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక నుంచి అనకాపల్లిలో కూడా గ్లకోమా శస్త్రచికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. గ్లకోమాపై గ్రామాల్లో కూడా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకే ప్రభుత్వం వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఈ కార్యక్రమంపై ప్రచారం చేయాలన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 55 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వీసం నానాజీ, 104 వైద్యాధికారి డాక్టర్ కీర్తి, ఉప సర్పంచ్ వీసం రాజు, వైద్యసిబ్బంది త్రినాథ్, రత్నం, ఝాన్సీ, రత్నం, నవరంజని విజయలక్ష్మి పాల్గొన్నారు.


నక్కపల్లి సచివాలయంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అపరాల పంటకు వాన గండం

ఎస్.రాయవరం : బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా మండలంలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా మబ్బు వాతావరణంతో ఉన్న ఆకాశం సాయంత్రానికి వర్షం కురిసింది. ఈ వర్షంతో అపరాలు సాగు చేసుకున్న రైతులు మాత్రం దిగులు చెందుతున్నారు. మరికొన్ని రోజుల్లో చేతికి వచ్చే మినుములు, పెసర చేలు కోత చేసుకుని ఉండడంతో తడిచి ముద్దయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చినుకులతో వ్యవసాయ పనులకు ఆటంకం

రాంబిల్లి : వాతావరణంలో మార్పు శనివారం కొనసాగింది. ఆకాశం మేఘావృతమైంది. అక్కడక్కడ తేలికపాటి చినుకులు పడ్డాయి. వాతావరణంలో మార్పుతో వ్యవసాయ పనులకు ఆటంకం కలిగింది. ధాన్యం, పెసర, మినుము నూర్పిడి పనులకు ఆటంకం ఏర్పడింది. వర్షం పడితే నష్టం వాటిల్లుతుందని, ఆహార ఉత్పత్తులను ఇళ్లకు చేర్చుకోవడం ఇబ్బందిగా మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

హత్య కేసులో అనుమానితుల విచారణ

మునగపాక: మునగపాక పోలీస్‌స్టేషన్‌ను యలమంచిలి సీఐ గఫూర్ శనివారం సందర్శించారు. గత ఏడాది అక్టోబర్ 12న హత్యకు గురైన యల్లపు మహాలక్ష్మినాయుడు మృతికి సంబంధించి అనుమానితులను స్టేషన్‌లో విచారించారు. స్టేషన్‌కు సంబంధించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్ఐ మహ్మద్ ఆలీ ఉన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు జరగాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మంజులవాణి


జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి లచ్చన్న

మునగపాక: జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి మంజులవాణి పిలుపునిచ్చారు. హౌసింగ్ దినోత్సవంలో భాగంగా శనివారం మండలంలోని వాడ్రాపల్లి జగనన్న కాలనీని ఆమె సందర్శించారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు జరగాలన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు,ఎంపీడీవో రవికుమార్,ఈవోఆర్డీ ఈశ్వరరావు,పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : ఇంటి స్థలం పొందిన ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి సూచించారు. హౌసింగ్ డే పురస్కరించుకుని భీమవరం గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మండలంలో ఉగాదికి 434 ఇళ్లు లక్ష్యం కాగా, 407 ఇళ్లు నిర్మాణాలు ఇప్పటికే పూర్తి కావడం ఆనందాయకమన్నారు. ఉగాదికి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామచంద్ర మూర్తి, హౌసింగ్ ఏఈ ప్రసాద్, మండల ఇంజినీర్ అధికారి దుర్గాశంకర్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల సందర్శన

పాయకరావుపేట : మండలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి సి.హెచ్.లచ్చన్న ఆదేశించారు. వెంకటనగరం గ్రామంలో జగనన్న కాలనీని సందర్శించి, ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. సత్వరం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలన్నారు. అనంతరం కేశవరం గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఈవోఆర్డీ చంద్రశేఖర్, హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు రద్దు

నక్కపల్లి : జగనన్న కాలనీలో స్థలం పొందిన వారంతా సత్వరం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. శనివారం నక్కపల్లిలో జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. లబ్ధిదారులను పిలిచి మాట్లాడారు. ఇంకా ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులతో మాట్లాడుతూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే పట్టాలు రద్దుచేసి ఆసక్తి ఉన్నవారికి పంపిణీ చేస్తామన్నారు. పేదలందరికీ సొంత ఇల్లు కలిగి ఉండాన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇళ్ల పట్టాతో పాటు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తోందన్నారు. పట్టాలు పొందిన వారికి చాలా గడువు ఇచ్చామని ఇక ఉపేక్షించే పనిలేదన్నారు. కార్యక్రమంలో ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలు సాగు చేసుకోవాలి


దేవవరంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నక్కపల్లి : రైతులంతా వేసవి దుక్కులు చేసి చిరుధాన్యాలు సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు టి.ఎస్. రాజ్‌కమల్ అన్నారు. శనివారం దేవవరం కాగిత గ్రామాల్లో క్షేత్రపర్యటన చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. అపరాలు తీసిన తర్వాత రైతులంతా వేసవి దుక్కులు ప్రారంభించాలన్నారు. ఊదలు, గంట్లు, రాగులు, సాగు చేయాలన్నారు. తక్కువ పెట్టుబడి, నీటి ఎద్దడిని తట్టుకుంటూ దిగుబడి వస్తుందన్నారు. కేవలం 250 -400 మిల్లీమీటర్ల వర్షపాతం సరిపోతుందన్నారు. ఎరువులు, పురుగు మందులు అవసరం లేదన్నారు. ఆరోగ్యపరంగా కూడా ఎంతో ఉపయోగపడతాయన్నారు. మధుమేహం గుండె జబ్బులు ఉన్నవారికి ఈ ఆహారం ఔషధంలా ఉపయోగపడుతుందన్నారు. ఆర్‌బీకే సిబ్బంది రైతులకు కావాల్సిన సూచనలు సహకారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో నక్కపల్లి ఏవో ఉమాప్రసాద్, ఏఈవో సత్యనారాయణ, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్‌జోన్ హాకీ టోర్నీకి ముగ్గురు ఎంపిక

యలమంచిలి: జిల్లాకు చెందిన హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న సౌత్‌జోన్ హాకీ పోటీల్లో పాల్గొనేందుకు మెన్స్ విభాగంలో యలమంచిలికి చెందిన కొఠారు తేజ, అప్పికొండ వెంకటేష్, ఉమెన్స్ విభాగంలో దేవరాపల్లికి చెందిన ఝాన్సీ ఎంపికైనట్టు అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ సమన్వయకర్త కొఠారు నరేష్ శనివారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం రామ్‌నాథ్‌పురంలో హాకీ ఇండియా పర్యవేక్షణలో సౌత్‌జోన్ మెన్స్, ఉమెన్స్ టోర్నీ నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన బాలబాలికలు చోటు దక్కించుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.


సౌత్‌జోన్ హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రిజిస్ట్రేషన్ కార్యాలయం మార్పు తగదు

తుమ్మపాల: పట్టణంలో రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం మార్పు యోచన విరమించుకోవాలని బీఎస్పీ నేత సూధికొండ మాణిక్యాలరావు జిల్లా రిజిస్ట్రార్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న భవనం పట్టణంలో అన్ని వసతులతో ఉందని, ఇక్కడ నుంచి కొత్తూరు పంచాయతీకి మార్చడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని చెప్పారు. కనీస సౌకర్యాలు లేని ప్రాంతానికి మార్చడంపై అధికారులు పునరాలోచించాలన్నారు. పాత రిజిస్ట్రేషన్ కార్యాలయ స్థలంలో నూతన భవనాన్ని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

క్రీడాకారిణికి సత్కారం


మౌనిక శ్యామలను సన్మానిస్తున్న నాయకులు

పాయకరావుపేట : పట్టణానికి చెందిన గొంతిన మౌనిక శ్యామల యూనివర్సిటీ క్రీడల్లో పతకాలు సాధించి పలువురి ప్రశంసలు అందుకుంది. ఏయూ బి.టెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న శ్యామల వర్సిటీలో ఈ నెల 15న జరిగిన 'మెట్రిసీ2కె 23' వార్షిక క్రీడా పోటీల్లో త్రోబాల్, బ్యాడ్మింటన్ తదితర పోటీల్లో పతకాలు సాధించింది. ఆమెను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ శనివారం ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖ అధికారి కె.ఎస్.గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు యాళ్ల వరహాలు, జగతా శ్రీను, కంభంపాటి వెంకటరమణ పాల్గొన్నారు.

25న వైఎస్సార్ ఆసరా నగదు జమ


వైఎస్సార్ ఆసరా మూడో విడత లబ్ధిదారుల జాబితా అందిస్తున్న దృశ్యం

కశింకోట: మండలంలోని జి.భీమవరం సచివాలయ పరిధిలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం నిధుల విడుదలపై స్వయం సహాయక సంఘాల మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. అర్హత ఉన్న స్వయం సహాయక సంఘాల ఖాతాలకు ఈ నెల 25న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేరుగా సొమ్ము జమ చేస్తారని వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. జి.భీమవరం పరిధిలో 81 సంఘాల్లోని 1001 మంది లబ్ధిదారులకు రూ.84 లక్షల ఆసరా సొమ్ము రానుందన్నారు. లబ్ధిదారుల జాబితా పత్రాలను సర్పంచ్ హనుమంతు వెంకట లక్ష్మణరావుకు అందజేశారు. సచివాలయ నోటీసు బోర్డులో జాబితాను అందుబాటులో ఉంచారు.మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, విఏలు కుమారి, లక్ష్మి మౌనిక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం


మాట్లాడుతున్న ప్రసాదరావు

రాంబిల్లి: చిరుధాన్యాల తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని హరిపురం కేవీకే సేద్యపు శాస్త్రవేత్త వాన ప్రసాదరావు అన్నారు. శనివారం అంతర్జాతీయ చిరుధాన్య సమ్మేళనం సందర్భంగా ఇక్కడి కేవీకేలో విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బండి నాగేంద్రప్రసాద్, బుర్ల శ్రీహరిరావు, డాక్టర్ విజయ, శ్రీకాంతగౌడ, డాక్టర్ ప్రవీణ్, దివ్యసుధ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ

నక్కపల్లి : కొత్త అమావాస్య, ఉగాది పండగలను పురస్కరించుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందాలు, రికార్డింగ్ డాన్సులు, పేకాట, తదితర అసాంఘిక కార్యక్రమాలు అరికట్టడానికి ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. జాతరల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేంది లేదన్నారు. గంజాయి రవాణా అరికట్టేందుకు జాతీయ రహదారిపై గస్తీ ముమ్మరం చేశామన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శిరీష ఉన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ


క్రీడా దుస్తులను అందిస్తున్న సర్పంచ్ దేముళ్లు, సాయికుమార్

కె.కోటపాడు: చదువుతోపాటు క్రీడల్లోను యువకులు రాణించాలని సర్పంచ్ బండారు దేముళ్లు ఆకాంక్షించారు. గుల్లేపల్లి గ్రామానికి చెందిన పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ రూ.10 వేలతో 12 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులతోపాటు రెండు వాలీబాల్‌లను సమకూర్చారు. తన తాతయ్య స్వర్గీయ రెడ్డి రాము జ్ఞాపకార్థంగా వీటిని అందించినట్లు తెలిపారు.